క్లుప్తంగా

ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం–పెనుమాక రహదారి మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు... యర్రబాలెంకు చెందిన భీమవరపు నాగయ్య గేదెల మేత కోసం తన ద్విచక్రవాహనంపై పెనుమాక వైపు బయలుదేరాడు. మర్రిచెట్టు ఎదుట ఉన్న డొంకరోడ్డు వద్ద పంట పొలానికి వెళ్లేందుకు మలుపు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వైద్య పరీక్షల నిమిత్తం హుటాహుటీన ఎయిమ్స్‌కు తరలించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శివాలయం ఎదుట స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రం వద్ద గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. యర్రబాలెంకు చెందిన పంది పుష్పావతి జ్ఞాపకార్థం ఆమె తనయుడు పుల్లారావు బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.సాయి, బి.వెంకట్రావు, ఎం.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష అన్నారు. గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో గురువారం నగరంలోని దళితవాడ ఎలిమెంటరీ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దళిత శిబిరం చైల్డ్ ప్రొటెక్షన్ నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా కురగంటి ఆదామ్, కార్యదర్శిగా వి బుజ్జిని ఎన్నుకున్నారు. దళితవాడలో బాల్య వివాహాలు జరగకుండా, బాలలపై లైంగిక వేధింపులు జరగకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, ఆర్‌పీ జ్యోతి, మధులత, బ్లెస్సి, ప్రియాంక, గుడ్‌షెఫర్డ్ ప్రతినిధులు ఎన్ నాగమణి, బి విజయలక్ష్మి, డి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల ఆందోళనకు సీఐటీయూ మద్దతు

మంగళగిరి: బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌సింగ్ ను అరెస్టు చేయాలని డిమాండ్‌చేస్తూ, రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలియజేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయకుండా ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా అడ్డుపడుతున్నారని విమర్శించారు. క్రీడా రంగంలో మహిళలు తమ ప్రతిభను కనబర్చుతున్నప్పటికీ వారిపట్ల బీజేపీ ఎంపీ ప్రవర్తించిన తీరును విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం రవి, బి వెంకటేశ్వర్లు, వై కమలాకర్, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పి పూర్ణ, కె గోపి, కె వెంగమ్మ, పి మేరి, జి నాంచారమ్మ, ఎస్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథల సమస్యల పరిష్కారానికి కృషి



నగరంపాలెం: వృద్ధులు, అనాథ బాలల సామాజిక, న్యాయ సమస్యల్ని పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి తెలిపారు. శ్రీనగర్ ఏడో వీధిలోని మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు నడింపల్లి జానకీ శైలజ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం వృద్ధులు, బాలలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ వృద్ధులకు పింఛన్లు, ఆధార్ కార్డులు, వైద్యసేవలు సక్రమంగా అందేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. వృద్ధుల్ని కుటుంబ సభ్యులు అకారణంగా వేధించడంతో పాటు ఆస్తుల్ని అక్రమంగా కాజేసి, మానసికంగా వేధించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత 24 ఏళ్లుగా వృద్ధులు, బాలల ఆశ్రమాల్ని నిర్వహిస్తున్న నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్, రాష్ట్ర ఎస్టీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఉయ్యాల టైగర్ ప్రసాద్, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, మాల కొండయ్య పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ
- 10వ తరగతి పరీక్షల్లో విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంఈఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తదితరులు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ అన్నారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గురువారం సత్కరించారు. అరుణ మాట్లాడుతూ కష్టపడి చదివినవారు అందరూ మంచి మార్కులతో పాస్ అయ్యారని, వారందరూ జీవితంలో వృద్ధిలోకి రావాలని అన్నారు. క్రమశిక్షణతో, శ్రద్ధగా చదువుకుని ఎంచుకున్న రంగంలో ముందుకు వెళ్లాలని ఆశిస్తున్నానన్నారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమష్టి కృషి, విద్యార్థుల కష్టపడే తత్వం, తల్లిదండ్రుల సహకారంతో ఈ సంవత్సరం ఉత్తర ఫలితాలు సాధించారని అన్నారు. గత విద్యా సంవత్సరం నుండే ఈమని పాఠశాలలో బాలికల కోసం ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా ప్రభుత్వం ద్వారా ప్రారంభించామని తెలిపారు. ప్రకాశరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. చదువుకునే వారికి దాతల సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన షేక్ నసీమా భానును అభినందించారు. తల్లిదండ్రుల కమిటీ వైస్ చైర్మన్ శిరీష మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు మొత్తం 69 విద్యార్థులు హాజరు కాగా 64 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫస్ట్‌క్లాస్ 44, సెకండ్ క్లాస్ 16, థర్డ్ క్లాస్ 04 వచ్చాయని, పి.నసిప్రియ 553, ఎం.పావని 552, మహిమ క్రాంతి 549, జి. శశికుమార్ 536, పి.కీర్తన 506, ఎం.సిద్దార్థ 506 మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు బహూకరించి, సర్టిఫికెట్ దాచుకునే ఫైల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బొంతు కోటయ్య, పూర్వ విద్యార్థి పి.రోశయ్య, ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వరరావు, యస్.ప్రకాష్‌రావు, టి. శ్రీనివాసరావు, రాజశేఖర్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు లక్ష్మి, శ్రావణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో బాల స్వేచ్ఛ వేసవి శిక్షణా శిబిరం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం స్వేచ్ఛా టీమ్ ఆధ్వర్యంలో కంప్యూటర్‌పైన సుమారు 400 మంది 8,9 తరగతులు చదువున్న విద్యార్థులకు 10 రోజులపాటు ఇచ్చిన ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కేఎల్‌యూ స్వేచ్ఛా కమిటీ అధ్యాపకులు శ్రీపతిరాయ్ గురువారం తెలియజేశారు. అయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 7,8 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఉచిత కంప్యూటర్ శిక్షణా శిబిరంలో కంప్యూటర్‌లో మెళకువలు నేర్చుతున్నామని, కంప్యూటర్ పట్ల అవగాహన పెంచుకుంటే పైతరగతులకు వెళ్లిన సమయంలో ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుదని అన్నారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల ప్రాంతాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా ఈ ఉచిత శిక్షణా శిబిరానికి హాజరయ్యారని అన్నారు. కంప్యూటర్ శిక్షణతోపాటు సామాజిక అంశాలైన నాటికలు, ఇంద్రజాలం, ఇంటివద్దనే చేయగల సైన్స్ ప్రయోగాల పట్ల ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పదిరోజులపాటు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు భోజనం, టిఫిన్‌లను కేఎల్ విశ్వవిద్యాలయం చైర్మన్ కోనేరు సత్యనారాయణ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి మొక్కులు తీర్చుకున్న నేతలు



టీటీడీ ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వెంకటపాలెం(తాడికొండ): అమరావతిలో పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు సమర్పించుకున్న అనంతరం స్వామి వారికి పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి సందీప్ మాట్లాడుతూ పేదలపై పెత్తందారులకు జరిగిన యుద్ధంలో చివరికి పేదలే విజయం సాధించారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేయడానికి మరింత శక్తిని ఇవ్వాలని వేడుకున్నట్లు తెలిపారు. అమరావతిలో ఇళ్ల స్థలాల పంపిణీకి ఓ వైపు శరవేగంగా ప్రభుత్వం పనులు చేస్తుంటే పెత్తందారులు దాన్ని అడ్డుకునేందుకు చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని, అంతిమంగా పేదలకు, ప్రభుత్వానికి అనుకూలంగా కోర్టులు తీర్పివ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో తుళ్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకటశివారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, చలివేంద్రం సురేష్ పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

డి పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో అభ్యంతరం లేని, అనధికారకంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని జీవిస్తున్న వారికి డి పట్టాలు ఇవ్వనున్నట్లు తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 చదరపు గజాలలోపు స్థలం ఉండి అన్ని అర్హతలు గల దారిద్ర్య రేఖకు దిగువన /ఎగువున ఉన్న అందరికీ ఉచితంగా డి పట్టా మంజూరు చేస్తామని తెలిపారు. 101 నుంచి 200 చదరపు గజాలు ఉన్నవారికి బేసిక్ విలువలో 50 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని, 201 నుంచి 300 చదరపు గజాలు ఉన్నవారికి బేసిక్ విలువలో 100 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని, 301 నుంచి 500 చదరపు గజాలు ఉన్నవారికి బేసిక్ విలువలో 150శాతం చెల్లించాలని తెలిపారు. 500 చదరపు గజాల వరకు, ఆ పైబడి ఉన్నవారి ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. 15–10–2019 లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని, అనధికారికంగా ఆక్రమించుకొని ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకొనదలచిన వారు 31–12–2023లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 101 నుంచి 500 చదరపు గజాల వరకు క్రమబద్ధీకరించుకొనుటకుగాను పైన తెలిపిన విధంగా రుసుము చెల్లించిన వారికి 'కన్వేయన్స్ డీడ్' ద్వారా ఆస్తికి హక్కులు బదలాయిస్తారని తెలిపారు. ఆ గృహమునకు సంబంధించి విద్యుత్ కనెక్షన్, నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి పన్ను రశీదు, ఇతర ఆధారాలతో గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిరుపేద పేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న స్థానిక నేతలు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడికి చెందిన నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. పెదవడ్లపూడికి చెందిన ఉయ్యాల నాగరత్నమ్మ, కూరపాటి ఫ్రాన్సిస్‌లకు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. నిత్యావసర సరుకులు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కేకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు. కుంచనపల్లిలో అరటికాయలు, కొబ్బరి బొండాల వ్యాపారం చేసే ఉప్పర కృష్ణ, చెరుకు రసం అమ్మే ఉప్పర కొండలరావు, కొబ్బరి బొండాలు అమ్మే సాంబమ్మలకు తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కుంచపల్లి కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ సర్పంచ్ చిలకయ్య, ఉప సర్పంచ్ అమరా నాగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కూరపాటి సాంబిరెడ్డి, దొంతిరెడ్డి తిరుమలరావు, కళ్లం శ్రీనివాసరెడ్డి, వాసు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో....

గుండిమెడలో సైకిల్‌పై అరిటికాయలు అమ్ముకునే నామతోటి శంకర్‌కు తోపుడు బండి అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు నామతోటి కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో చిట్టా కోటేశ్వరరావు, గుండిమెడ అర్జునరావు, గుండిమెడ హనుమంతరావు, నామతోటి వెంకట్, రవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఐలా సత్యనారాయణ రూ.15 వేలు, ఈమని గ్రామానికి చెందిన బొన్నరావూరి రాజుకు రూ.15 వేలు, దుగ్గిరాల గ్రామానికి చెందిన కారంపూడి సోమయ్యకు రూ.15 వేలు చొప్పున గురువారం ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేరుకలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషీబాయి, ఈమని సొసైటీ ప్రెసిడెంట్ నలుకుర్తి యేసుపాదం, వైఎస్సార్ సీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి, ఆళ్ల మహేష్, వెంకటేశ్వర నాయక్, ఆత్మకూరి నాగేశ్వరరావు, కర్ర్యూరావు తదితరులు పాల్గొన్నారు.

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌కు మహర్దశ

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

పట్నంబజారు: కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌కు మహర్దశ పట్టిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. ఆయన గురువారం వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి, అభివృద్ధి పనుల గురించి అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్‌లో రూ. 3.50 కోట్లతో ఏపీ అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పార్కును పూర్తి స్థాయిలో పరిశీలించి అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. ఏపీ అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ ద్వారా టెండరు సిద్ధం చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, కేవలం శంకుస్థాపనకే పరిమితమైన ఘనత చంద్రబాబుదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమంటేనే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్సు అని స్పష్టం చేశారు. అడిగిన వెంటనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు, ప్రధాన రహదారులు, వాకింగ్‌ట్రాక్‌లు పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్‌లో కాలినడక దోవ, ప్రహరీ, షటిల్ కోర్టు నిర్మాణానికి రూ. 3.50 కోట్లతో టెండరు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.75 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 87.50 లక్షలు, గుంటూరు మున్సిపాలిటీ రూ. 87.50 లక్షలు భరించనున్నట్లు వివరించారు.

ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

యూపీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష



మంగళగిరి: ఎండలు, వడగాల్పుల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు పాటించాలని గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి పి.అనూష సూచించారు. వడదెబ్బ తగిలినప్పుడు విరేచనాలు, వాంతులు, తల తిరగడం, కండరాలు పట్టి వేయడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రాకూడదని, సబ్జా నీళ్లు, కొబ్బరి నీళ్లు వంటివి ఎక్కువ తీసుకుంటూ ఉండాలన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వారిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి చల్లని వస్త్రంతో తుడవాలన్నారు. 101, 102 డిగ్రీల జ్వరం వస్తే సమీపంలోని హెల్త్ సెంటర్‌కు తరలించాలన్నారు. ఒక లీటరు నీటిలో ఆరు స్పూన్ల పంచదార, ఆరు స్పూన్ల ఉప్పు వేసుకుని కలిపి వడదెబ్బ తగిలినప్పుడు తాగితే వెంటనే కోలుకుంటారన్నారు. హెల్త్‌సెంటర్‌లో ఓఆర్ఎస్ డ్రింక్ కార్నర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఎండ నుంచి రక్షణ పొందడానికి గొడుగు వేసుకోవడం, తలకు టోపీ ధరించడం, నలుపు వస్త్రాలకు దూరంగా ఉండటం, కాటన్ దుస్తులు ధరించడం వల్ల వడదెబ్బ నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. వేసవిలో తీవ్రమైన శ్రమకులోను చేసే వ్యాయామాలను తగ్గించాలన్నారు. ఏసీల నుంచి హఠాత్తుగా ఎండలోకి వెళ్లడం సరికాదని, శరీరాన్ని నెమ్మదిగా వేడికి అలవాటు చేయాలన్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలను ఎండలోకి వెళ్లనీయకుండా, వడదెబ్బకు గురికాకుండా తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరాలలో మినహా ప్రయాణాలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. హెల్త్ సెంటర్‌లో డి హైడ్రేషన్, వడదెబ్బకు వైద్యం అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

లారీలను అడ్డుకున్న స్థానికులు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని నిడమర్రులో రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్న ఇసుక, గ్రావెల్ లారీలను స్థానిక ప్రజలు బుధవారం అర్ధరాత్రి అడ్డుకున్నాడు. రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. పగలు– రాత్రి తేడా లేకుండా వందల సంఖ్యలో వాహనాలు అతివేగంగా రాకపోకలు సాగించడం వల్ల దుమ్ము, ధూళి రేగి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైకి రావాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తుందని వాపోయారు. రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో రోడ్డును నీటితో తడపకుండా ఉండటం వల్ల ఫ్లైయాష్ దుమ్ము రేగి కళ్లల్లో పడుతుందని, ఎన్నోమార్లు ఇదే విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఇసుక, మట్టి లారీలు తిరుగుతున్న ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే నిడమర్రులో రోడ్డు దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు

ఫిరంగిపురం: అనధికారికంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ పద్మనాభుడు సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 పదో నెల, అంతకు పూర్వం అభ్యంతరం లేకుండా అనధికారికంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని జీవించేవారు భూమిని కేటాయించే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జీవోఎంఎస్ నెం 225 ప్రకారం కొన్ని సవరణలతో క్రమబద్ధీకరించనున్నామన్నారు. ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోదలచిన వారు వారి ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని చెప్పారు. వందగజాల వరకు అర్హతలు ఉండి దారిద్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న వారికి ఉచితంగా డి పట్టా మంజూరు చేస్తామన్నారు. విద్యుత్ కనెక్షన్, నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి పన్ను రశీదు వంటి ఆధారాలతో ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

మంగళగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, ఎం రవి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు చూపి ఇళ్ల స్థలాలు, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ వంటి అనేక సంక్షేమ పథకాలు రద్దు చేశారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. విలీన గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు రూ.21వేలు చెల్లించాలని, కార్పొరేషన్‌లో విలీనం చేసిన 105 మంది రాజధాని సీఆర్‌డీఏ కార్మికులకు మూడు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ కార్డులు నగరపాలక సంస్థ అధికారులే తయారుచేసి కార్మికులకు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్ జీతాలు ఇవ్వాలని కోరారు. అనంతరం సీఐటీయూ నేతలు అడిషనల్ కమిషనర్ హేమమాలినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి వెంకటేశ్వర్లు, వై.కమలాకర్, పి.పూర్ణ, కె గోపి, కె వెంకమ్మ, పి మేరి, ఎస్ శాంతి, జి నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు ప్రజలే కొండంత అండ

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- తాడికొండలో గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమం పథకాల గురించి వివరించి, సమస్యలు తెలుసుకుంటున్న కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల పక్షాన నిలబడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలే కొండంత అండని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ సచివాలయం–2లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారులు, నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించిన ఆయన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ కుటుంబాన్ని కదిలించినా జగనన్న సంక్షేమ పథకం ఏదో ఒక రూపంలో అంది మేలు పొందారనేందుకు గడపగడపలో వస్తున్న ఆదరణ, చిరునవ్వే నిదర్శనం అన్నారు. 75 సంవత్సరాల భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని ఎలాంటి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు అందించిన జగనన్నకు ప్రజాదరణ మెండుగా ఉందన్నారు. రాష్ట్రంలో పేదలకు 35 లక్షల ఇళ్ల స్థలాలిచ్చిన జగనన్న మరో అడుగు ముందుకేసి రాజధాని ప్రాంతంలో పేదలకు 54 వేల పట్టాలు అందజేస్తుంటే అక్కసుతో వ్యవహరించడం చంద్రబాబు కుటిల బుద్ధికి నిదర్శనమన్నారు. పేదలంటే అలుసుతో సెంటు స్థలం సమాధి నిర్మించడానికి చాలదంటున్న చంద్రబాబుకు ఇక రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. పేదల ఆర్థిక ఎదుగుదల ఇష్టంలేక చంద్రబాబు చేస్తున్న పిచ్చి ప్రేలాపనలు ఇకనైనా కట్టిపెట్టకపోతే ప్రజల్లో తిరగకుండా అడ్డుకోవడం ఖాయమన్నారు. రాజధాని అంటే బాబు సొంత జాగీరులా భావించి అక్కడ పేదలకు చోటు లేకుండా చేయాలని చూసిన బాబుకుక తగిన శాస్తి జరగడం ఖాయమని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 175/175 సీట్లు గెలిపించి చంద్రబాబును రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోకల సరోజినీ, నిడుముక్కల, కంతేరు సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్‌బాబు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి తోకల నరసింహారావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి వెంకట్రావు,పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

51 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: వృద్ధులు, పిల్లలు, గర్భిణులు వేసవిలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ ఆష్రఫ్‌తజీన్ అన్నారు. మండలకేంద్రంలోని సబ్ సెంటర్‌వద్ద గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 51మందికి రక్త, మూత్ర పరీక్షలు చేసి మందులు అందజేశారు. నలుగురు గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అమృతరాణి, ఏఎన్ఎం లావణ్య, విజయ్, గోవిందయ్య, డీఈవో విజయ్‌కుమార్, సింగరాజు, ఆశాకార్యకర్తలు అంజలి, శైలజ. సుజాత, నిర్మల జ్యోతిలు పాల్గొన్నారు.

తాడికొండ జెడ్పీటీసీ భర్తపై దాడి

- అక్రమ క్వారీయింగ్‌ను పరిశీలిస్తున్న వీర్లంకయ్య
- ద్విచక్ర వాహనంపై వచ్చి బీరు సీసాతో దాడి



తాడికొండ: తాడికొండ జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి భర్త గుడిమెట్ల వీర్లంకయ్యపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తాడికొండ మండలం నిడుముక్కల–లచ్చన్న గుడిపూడి గ్రామాల మధ్య అక్రమంగా క్వారీయింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు బీరు సీసాతో తలపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. దాడిలో తలకు బలమైన గాయమై రక్తం కారడంతో స్థానికుల సాయంతో జీజీహెచ్‌కు తరలించి చికిత్స అనంతరం తాడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు.